
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.4, కనిష్ఠం 21.1
కామారెడ్డి జిల్లా వార్తలు
5
బుధవారం 6 మార్చి 2024



ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తాం

సదాశివనగర్, మార్చి 5: ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సమర్థవంతంగా నిర్వహించి లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో సంతోష్‌కుమార్ తెలిపారు. మంగళవారం ప్రజాపాలన సేవాకేంద్రాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా చేపట్టిన దరఖాస్తులను ఇప్పటికే ఆన్‌లైన్‌లో పొందుపరచడం జరిగిందని కొన్ని దరఖాస్తుల్లో కొంత సమాచారం సక్రమంగా లేకపోవడం కాని ఆన్‌లైన్‌లో పొరపాట్ల వల్ల కాని కొంతమందికి లబ్ధిచేకూరకపోవడం లాంటి పొరపాట్లను సరిచేయడానికి ప్రజాపాలన సేవాకేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.



ధరణి కష్టాలు.. తీరేనా?

కామారెడ్డి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ధరణితో ఇబ్బందులు పడుతున్న రైతుల కష్టాలు త్వరలో తీరనున్నాయి. భూముల వివరాలకు సంబంధించి తప్పొప్పులు రావడం, సర్వే నెంబర్లు, పేర్లు, ఇతరత్రా వివరాలు తప్పుగా పడడం, ఓ పట్టాదారుడికి బదులు మరో పట్టాదారుడి పేర్లు రావడం, సర్వే నెంబర్‌లు మారడం, విస్తీర్ణం ఎక్కువ, తక్కువ పడడం, పట్టా భూములు ప్రొహిబీటెడ్‌లో ఉండడం వంటి సమస్యతో అనేక మంది రైతులు మండల తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వీటి పరిష్కారానికి గత ప్రభుత్వం వివిధ మాడ్యుల్స్‌ను ధరణి పోర్టల్‌లో ప్రవేశపెట్టినప్పటికీ పెద్దగా పరిష్కారానికి నోచుకోలేదు. ఒక్కో దరఖాస్తుపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదికలు సమర్పించిన తర్వాత కలెక్టర్ తన పరిధిలో ఉండే అక్కడే పరిష్కరించి, పరిధిలో లేనివాటిని సీసీఎల్‌కు పంపించారు. కొందరి సమస్యలు పరిష్కారం అయినప్పటికీ జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 3 వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ధరణి పోర్టల్ అంతా రహస్యంగా ఉందని దీని వల్ల విలువైన భూముల వివరాలు చోర్యానికి గురవుతుందని అనేక మంది రైతుల భూములు మాయమయ్యాయని, తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రక్షాళన చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ప్రకటించారు. అధికారంలోకి రాగానే ఆ మేరకు ధరణి పోర్టల్‌పై అధ్యాయనం చేసేందుకు ఓ కమిటీ వేశారు. కమిటీ సూచనల మేరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఈనెల 9లోపు పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో తహసీల్దార్, ఆర్డీవోలకు పలు అధికారాలను కట్టబెట్టింది. ఇప్పటికే భూ సమస్యల దరఖాస్తులను రెవెన్యూ శాఖ విచారణ చేపడుతోంది.

- పెండింగ్‌లో 3 వేలకు పైగా భూ సమస్యల దరఖాస్తులు
- ఈనెల 9 వరకు పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశం
- తహసీల్దార్, ఆర్డీవోలకు బాధ్యతలు
- నిషేధిత జాబితాలో పడిన సర్వే నెంబర్లపై ప్రత్యేక దృష్టి
- ఇప్పటికే దరఖాస్తులపై విచారణ మొదలుపెట్టిన రెవెన్యూ శాఖ

జిల్లాలో 8.63 లక్షల ఎకరాల్లో వ్యవసాయ భూ విస్తీర్ణం

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో సాగు భూములకు సంబంధించి 8,63,973 ఎకరాల భూ విస్తీర్ణంలో వివిధ పంటలు సాగవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,77,898 ఖాతాలు ఉన్నాయి. వ్యవసాయ ఖాతాలతో పట్టాపాసు పుస్తకాలు ఇప్పటి వరకు పంపిణీచేసినవి 2,58,298 ఉండగా వీటి పరిధిలో 5,14,576 ఎకరాలలో భూ విస్తీర్ణం ఉంది. అయితే గత 10 ఏళ్ల కిందట గత ప్రభుత్వంలో భూ దస్త్రాల ప్రక్షాళన సమయంలో రైతులకు చెందిన సర్వే నెంబర్లతో పాటు ఇతరత్రా రైతులకు చెందిన సాగు భూముల సర్వే నెంబర్‌లో నిషేధిత జాబితాలో పడ్డాయి. బాధిత రైతులు ప్రతిరోజూ జిల్లా కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. అయితే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ సర్కార్ ధరణిని ప్రక్షాళన చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో బాధిత రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికైనా తమ భూ సమస్యలు పరిష్కారం అవుతున్నాయని భావిస్తున్నారు.

15 వేలకు పైగా భూ సమస్యల దరఖాస్తులు

గత ప్రభుత్వం ధరణిని అందుబాటులోకి తీసుకువచ్చినప్పటికీ చాలా మంది రైతులకు సంబంధించిన వేలాది ఎకరాల భూములు నిషేధిత జాబితాలోనే కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఆర్ఎస్ఆర్ సమస్యలతో సుమారు 7వేలకు పైగానే దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి పరిష్కారానికి 6 వేల మందికి పైగా రైతులు పట్టాపాసుపుస్తకాలు అందని పరిస్థితి నెలకొంది. కామారెడ్డి పరిధిలో 4213, ఎల్లారెడ్డిలో 2,650, బాన్సువాడలో 1,232 దరఖాస్తులు ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే ఉంటున్నాయి. వీరికి పట్టాపుస్తకాలు అందకపోవడమే కాకుండా పట్టా భూములైనప్పటికీ ప్రభుత్వ భూములుగా నమోదై ఉన్నాయి. అదేవిధంగా ఒక గ్రామంలో ఏదైన సర్వే నెంబర్‌లోని ఓ రైతుకు చెందిన భూమికి సంబంధించి న్యాయ వివాదం ఉంటే ఆ సర్వే నెంబర్‌ను పూర్తిగా నిషేధిత జాబితాలో చేర్చారు. గతంలో ప్రవేశపెట్టిన ఆప్షన్‌లలో అటువంటి భూ సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంది. అదేవిధంగా భూ దస్త్రాల ప్రక్షాళన సమయంలో అందుబాటులో లేని రైతులకు చెందిన సర్వే నెంబర్‌తో పాటు ఇతరత్రా రైతులకు చెందిన సాగు భూముల సర్వే నెంబర్‌లను నిషేధిత జాబితాలో నమోదు చేశారు. ఇలా కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ పరిధిలో మొత్తం 8,430 సర్వే నెంబర్‌లు నిషేధిత జాబితాలో చేర్చడంతో సుమారు 4,225 మంది బాధిత రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలా ధరణితో 10 ఏళ్లుగా భూ సమస్యల పరిష్కారం కాకుండా ఏళ్ల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

రికార్డుల పరిశీలన

ప్రభుత్వ ఆదేశాల మేరకు టీఎం 4, 10, 14, 32 మాడ్యుల్స్‌లో ఉన్న సక్సెషన్, జీపీఏ/ఎస్‌పీఏ, భూ రికార్డుల అంశాల్లో ఫిర్యాదులు, ఖాతా మెర్జింగ్ సంబంధిత దరఖాస్తులు తహసీల్దార్ స్థాయిలో రికార్డులు పరిశీలించి చర్యలు చేపట్టాలన్నారు. ఒకవేళ దరఖాస్తులను తిరస్కరించినట్లయితే తగిన కారణాలతో సమాచారం దరఖాస్తుదారులకు ఇవ్వనున్నారు. టీఎం 7, 16, 20, 22, 33 మాడ్యుల్స్‌లో ఉన్న నాలా, భూ సేకరణ ఫిర్యాదులు, ఎన్నారై పోర్టల్, సంస్థల పట్టా పాసుపుస్తకం, కోర్టు కేసులు, మిస్సింగ్ సర్వే నెంబర్, విస్తీర్ణ సవరింపు మొదలగు దరఖాస్తులను తహసీల్దార్‌లు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి సిఫారస్‌లతో ఆర్‌డీవోలకు పంపాలని సదరు ఆర్‌డీవో ఆ దరఖాస్తులపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. కేఎల్ ఫారం, టీఎం 3, 4, 15, 23, 24, 31, 33 మాడ్యుల్స్‌లో ఉన్న మ్యూటేషన్, అసైన్ భూముల సక్సేషన్, ప్రొహిబీటెడ్ జాబితా ఆస్తుల సమస్యలు, పట్టా పాసుపుస్తకం, సెమీ అర్బన్ ల్యాండ్ పట్టా పాసుపుస్తకం, కోర్టు కేసులు, నాలా కన్వర్షన్, పట్టా పాసు పుస్తకంలో సవరింపులు మొదలగు దరఖాస్తులపై కలెక్టర్ నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం పేర్కొంది. కేఎల్ ఫారం దరఖాస్తులను ఆర్డీవో, మిగిలిన మాడ్యూల్స్ దరఖాస్తులను తహసీల్దార్ క్షేత్రస్థాయిలో విచారించి నివేదిక అందించనున్నారు. వాటి ఆధారంగా తుది నిర్ణయం తీసుకోనున్నారు. ప్రతీ మండలంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐలు బృందాలుగా ఏర్పడి పరిష్కరించాలన్నారు. వారం రోజుల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది.

సీఎం పట్టింపులేనితనంతోనే విద్యార్థి మృతి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత

ఎమ్మెల్సీ కవిత

భిక్కనూరు/గాంధారి/సదాశివనగర్, మార్చి 5: పరిపాలన చేతకాని ప్రభుత్వ నిర్లక్ష్యం, సీఎం రేవంత్‌రెడ్డి పట్టింపులేని తనంతోనే విద్యార్థి వెంకట్ మృతి చెందాడని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. మంగళవారం రాజంపేట మండలంలోని పొందూర్తి వద్ద ఎమ్మెల్సీ విలేకరుల సమావే శాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ బోధన్ హాస్టల్‌లో వార్డెన్ లేక, వాచ్‌మెన్ లేక, ఎవరూ పట్టించుకునే వారు లేక విద్యార్థుల మధ్య జరిగిన చిన్న గొడవ కారణంగా చేతికొచ్చిన కొడుకు డిగ్రీ ఫైనలియర్ విద్యార్థి తిప్పారం తండాకు చెందిన విద్యార్థి మరణించగా, ఏడుగురు ఇంటర్ విద్యార్థులు మర్డర్ కేసులో ఇరుక్కుని జైలుకు వెళ్లే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేదు. పరిపా లన చేతకాదు. విద్యాశాఖపై రివ్యూ చేపట్టాలని ఇప్పటికీ ఎన్నిసార్లు సీఎంకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు ఈయన నియామక పత్రాలు ఇచ్చే కార్యక్ర మంలో సైతం మొత్తం సీఎం పొలిటికల్ స్పీచే ఇచ్చారని ఎద్దేవా చేశారు. విద్యార్థులు పిట్లల్లా రాలుతున్నా సీఎంకు పట్టింపు లేకుండా చిల్లర రాజకీయం చేస్తున్నారని అన్నారు.

హాస్టల్ వార్డెన్, వాచ్‌మెన్ లేకపోవడంతోనే సంఘటనలు

గాంధారి మండలంలోని తిప్పారం తండాలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోధన్ హాస్టల్‌లో విద్యార్థి హర్యాల వెంకట్ చనిపోవడంతో పాటు మరో 8 మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిందని అన్నారు. హాస్టల్ వార్డెన్, వాచ్‌మెన్ లేకపోవడంతో ఈ సంఘటన చోటు చేసుకుందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పట్టింపులేని చర్యల వల్లనే ఈ సంఘటన చోటు చేసుకుందని అన్నారు.

మృతుడి తల్లికి పెన్షన్, సోదరునికి ప్రభుత్వ ఉద్యోగం, 15లక్షల నష్టపరిహారం, ఒక డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దీన్, ఎంపీపీ రాధ బలరాంనాయక్, జడ్పీటీసీ శంకర్‌నాయక్, మాజీ సర్పంచ్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత

సదాశివనగర్ మండల కేంద్రానికి చెందిన ఏనుగు జనార్ధన్‌రెడ్డి, ఏనుగు ప్రతిభలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా మంగళవారం వారి అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అంత్యక్రియల్లో పాల్గొనగా ఎమ్మెల్సీ కవిత విషయం తెలుసుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఒకేసారి తల్లిదండ్రులను కోల్పోవడం అంతకంటే జీవితానికి వేరే శిక్ష ఉండదని ఇలాంటి సమయంలో మనో ధైర్యంతో ఉండాలని అన్ని విధాల తమ సహకారం ఉంటుందని భరోసానిచ్చారు.

కాల భైరవస్వామికి ప్రత్యేక పూజలు

రామారెడ్డి, మార్చి 5: మండలంలోని ఇస్సన్నపల్లి-రామారెడ్డి గ్రామాల మధ్య వెలసిన కాల భైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం స్వామి పర్వదినం కావడంతో పురోహితులు శ్రీనివాస్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య భైరవునికి క్షీరాభిషేకం, సింధూర పూజలు, అర్చనలు, హారతి వంటి పూజా కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. రూ.8,610 దండాను స్వామి వారి మెడలో వేశారు. అనంతరం మధ్యాహ్నం స్వామి వారి సన్నిదానంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సురేందర్‌గుప్తా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారికి పూజలు నిర్వహించిన దృశ్యం

ఉపాధ్యాయులు.. దారి తప్పుతున్నారు!



కామారెడ్డి టౌన్, మార్చి 5: విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు మంచి నడవడికను నేర్పాల్సిన ఉపాధ్యాయులే దారితప్పి తమ బిడ్డల, మనమరాళ్ల వయస్సున్న పిల్లలతో అసభ్యంగా ప్రవర్తిస్తూ గౌరవప్రదమైన ఉపాధ్యాయ ఉద్యోగానికి కొందరు కలంకం తెస్తున్నారు. విద్యాసంస్థలకు రాకపోకలు సాగిస్తున్న క్రమంలో ఆకతాయిల వేధింపులతో విద్యార్థినులు మనోవేదనకు గురవుతున్నారు. నిత్యం భయపడుతునే పాఠశాలలు, కళాశాలలకు వెళ్లివస్తుండగా తల్లిదండ్రులు సైతం వారు ఇంటికి వచ్చే వరకు ఆందోళన చెందుతున్నారు. ఆకతాయిలకు తామేమి తీసిపోమన్నట్లుగా జిల్లాలోని కొందరు ఉపాధ్యాయులు సైతం లైంగిక వేధింపులకు పాల్పడుతుండడంతో విద్యార్థినులు, తల్లిదండ్రుల బాధ వర్ణణాతీతంగా ఉంటుంది. గత రెండు సంవత్సరాల కాలంగా జిల్లాలో ఇలాంటివే నాలుగు సంఘటనలు వెలుగు చూశాయి. ఇవేకాక ఇంకా ఎన్నెన్నో వెలుగుచూడనివి ఉంటున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని విద్యార్థి సంఘ నాయకులు పేర్కొంటున్నారు. సంఘటన జరిగినప్పుడే హడావిడిచేస్తు ఆ తర్వాత ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్నా ఒత్తిడితో పటిష్ఠ చర్యలకు వెనుకడుగు వేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

విద్యావ్యవస్థకు కలంకం తెస్తున్న పలువురు ఉపాధ్యాయులు

తల్లిదండ్రుల తర్వాత అంతగా ఆరాధించి, గౌరవించేది ఉపాధ్యాయులని అలాంటి ఉపాధ్యాయులు తమ పిల్లల వయస్సున్న వారితో అసభ్యంగా ప్రవర్తించడం సిగ్గుచేటని విద్యార్థి సంఘ నాయకులు పేర్కొంటున్నారు. తాడ్వాయి మండలంలోని ఓ ప్రధానోపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల నిత్యం అసభ్యంగా ప్రవర్తిస్తుండడంతో ఆయన వేధింపులు తాళలేక విద్యార్థులు వారి తల్లిదండ్రుల దృష్టికి సదరు ప్రధానోపాధ్యాయుడి వ్యవహరశైలిని తీసుకెళ్లారు. దీంతో పాఠశాలకు వచ్చి ప్రధానోపాధ్యాయుడి ప్రవర్తన తీరుపై నిలదీయడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలా గత రెండు సంవత్సరాల కాలంలో అనేక సంఘటనలు చోటు చేసుకున్నాయి. సదాశివనగర్ మండలంలోని ఓ పాఠశాలలో ఉపాధ్యాయుడు విద్యార్థినులకు అశ్లీల వీడియోలు చూపడంతో పాటు ల్యాబ్‌కు రావాలంటూ లేకపోతే ప్రాక్టికల్ మార్కులు వేయనంటూ చెప్పడంతో సదరు విద్యార్థినులు ఈ విషయాన్ని తల్లిదండ్రులకు వివరించారు. దీంతో ఆ విద్యార్థిని తల్లిదండ్రులు స్థానిక ప్రజాప్రతినిధులకు తెలుపడంతో వారు పాఠశాలలో ఉపాధ్యాయుడిని నిలదీయడంతో పాటు విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకుపోవడంతో సదరు ఉపాధ్యాయుడిని అక్కడి నుంచి మరో పాఠశాలకు బదిలీ చేసి విచారణ అనంతరం సస్పెండ్ చేశారు. గాంధారి మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయునిపై షీటీం సభ్యులు అవర్నేస్ నిర్వహిస్తున్న సమయంలో విద్యార్థినులు వారు ఎదుర్కొంటున్న వేధింపులను షీ టీం సభ్యులకు వెల్లబోసుకున్నారు. ఈ విషయాన్ని షీటీం అధికారులు విద్యాశాఖాధికారులకు తెలిపారు. బిచ్కుంద మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఓ విద్యార్థినిపై ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించడంతో స్థానికులు, విద్యార్థిని తల్లిదండ్రులు సదరు ఉపాధ్యాయునికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఇలా జిల్లాలో బయటకు వచ్చే సంఘటనలు కొన్నే ఉంటున్నాయని చాలా మంది ఉపాధ్యాయులు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న విద్యాశాఖాధికారులు తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- బాలికలను వేధింపులకు గురిచేస్తున్న కొందరు ఉపాధ్యాయులు
- తాడ్వాయిలో ఓ ప్రధానోపాధ్యాయుడిపై కేసు నమోదు
- విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు
- పాఠశాలల్లో నామ మాత్రంగానే బాలిక క్లబ్‌లు, కమిటీలు
- నిత్యం విద్యార్థినులు, తల్లిదండ్రులకు తప్పని మనోవేదన

కమిటీలు ఉన్నా.. పనితనం సున్నా!

జిల్లాలోని పలు పాఠశాలలో 2022లోనే బాలికల క్లబ్‌లు, కమిటీలు ఏర్పాటు చేశారు. పాఠశాల హెచ్‌ఎంలు చైర్మన్‌గా, ఒక టీచర్ కన్వీనర్‌గా, హైస్కూల్‌లో ప్రతీ తరగతి గది నుంచి ఇద్దరు బాలికలు, స్థానిక మహిళ పోలీసు, షీటీం సభ్యులు ఇలా 10 నుంచి 12 మంది కమిటీలో సభ్యులు ఉన్నారు. కమిటీ సమావేశాలు తరచూ నిర్వహించి, బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, పరిష్కారానికి కృషి చేయాలి. బాలికలకు అవగాహన కల్పించేందుకు బాలికల సంరక్షణకు ఏర్పాటు చేసిన 181, 100, 1098 టోల్‌ఫ్రీ నెంబర్లను పాఠశాలల ఆవరణలో ప్రదర్శించాలి. కానీ చాలా చోట్ల అంతంత మాత్రంగానే కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు. ఏదైన సంఘటన జరిగినప్పుడే హడావిడి చేయడం కాకుండా చిత్తశుద్ధితో బాలిక సంరక్షణ చర్యలు చేపట్టాలని విద్యార్థి సంఘ నాయకులు, ఇప్పటికే పలు పాఠశాలలో జరిగిన సంఘటనలకు సంబంధించిన తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బీర్కూర్, మార్చి 5: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో ఈనెల 14 నుంచి 19వ తేదీ వరకు లక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ నవమ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇదిలా ఉండగా మంగళవారం ఆలయ ధర్మకర్త, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి శ్రీవారిని, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు పెద్ద సంఖ్యలో బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. శ్రీవారి కృపకు పాత్రులు కావాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.



టీటీడీలో శ్రీవారి బ్రహ్మోత్సవాల కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



వాగులో నుంచి ఇసుకను తీస్తున్న దృశ్యం

పేరుకే ప్రభుత్వ పాయింట్..
ఇసుక వ్యాపారులదే ఆధిపత్యం!

● ఇసుక అక్రమ రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి

మోర్తాడ్, మార్చి 5: మండలంలోని సుంకెట్ గ్రామ శివారులోని పెద్ద వాగు నుంచి ఇసుక తీసేందుకు అధికారులు ప్రభుత్వ పాయింట్‌ను ఏర్పాటు చేసినా, వాగుపై ఇసుక వ్యాపారుల పెత్తనం జరుగుతున్నది. గ్రామాలలో ఇళ్ల నిర్మాణాలు చేసుకుంటున్న వారు తహసీల్ కార్యాలయం నుంచి అవసరం వున్న వేబిల్లులు తీసుకున్నా.. సొంతంగా ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకునే వీలులేదు. యజమానులు తీసుకున్న వేబిల్లులు ఇసుక వ్యాపారులకు ఇవ్వాల్సిందే. లేదంటే వేరే ట్రాక్టర్లను అనుమతించరు. వేబిల్లులు వున్న లబ్ధిదారులు.. వారు చెప్పిన ధరనే చెల్లించాలి. అంతేకాక గ్రామాలలో ఇళ్లు కట్టుకునే వారికి అవసరం ఉన్న ఇసుక కంటే ఎక్కువ ట్రిప్పులు అవసరం అని వారితో రాయించుకుంటారు. ఇటీవల ఆర్మూర్ వైపు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్లను వేల్పూర్ పోలీసులు తనిఖీ చేస్తే.. తప్పుడు వేబిల్లులతో అక్రమంగా ఇసుక సరఫరా చేస్తున్నారని గుర్తించారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తే జరిమానా చెల్లించి విడిపించుకున్నారు. ఇసుక అక్రమ రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. వేబిల్లులు తీసుకున్న వారు సొంతంగా ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకునే సౌకర్యం కల్పించాలని, ఇసుక పాయింట్‌పై అధికారులు గట్టి నిఘా పెట్టి దొంగ వేబిల్లుల ద్వారా ఇసుక అక్రమ రవాణా జరుగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత శాఖ అధికారులపై వుంది.

● ఇసుకను తరలించేందుకు వేబిల్లులు రెన్యూవల్ చేశాం

: సత్యనారాయణ, తహసీల్దార్, మోర్తాడ్

సుంకెట్ ఇసుక పాయింట్ వద్ద నిజమైన గృహ నిర్మాణదారులకే వేబిల్లులు ఇస్తున్నాం. ఇసుక పాయింట్ వద్ద రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌ను ఏర్పాటు చేశాం. సోమవారం ఇసుకను తరలించేందుకు 260 వేబిల్లులు గృహ నిర్మాణాలకు, పది ప్రభుత్వ పనులకు, నాలుగు వేబిల్లులను రిన్యూవల్ చేశామన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటాం.



రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

ఆర్మూర్ రూరల్, మార్చి 5: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలో పాల్గొనే జూనియర్ బాలుర జిల్లా జట్టును మంగళవారం ఎంపిక చేశారు. పెర్కిట్‌లోని నవ్యభారతి గ్లోబల్ స్కూల్ క్రీడా మైదానంలో ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులకు ఎంపిక పోటీలు నిర్వహించి జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్టు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగామోహన్ చక్రు, ప్రధానకార్యదర్శి సురేందర్ తెలిపారు. వీరు ఈనెల 8 నుంచి వరంగల్‌లో జరగనున్న 45వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర పోటీలలో పాల్గొంటారన్నారు. ఇందులో కోశాధికారి గరడి రాజేష్, పాఠశాల డైరెక్టర్ జవహర్, సదామస్తుల రమణ, వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు.


భక్తుల కొంగు బంగారం.. పడిలేచిన మర్రిచెట్టు

- పడిలేచిన మర్రిచెట్టు శివసాయి దేవస్థానంగా పిలుస్తారు
- ఆలయ ఆవరణలో కొలువైన సాయిబాబా, హన్మాన్ ఆలయాలు
- దాతల సాయంతో 36 అడుగుల హన్మాన్ విగ్రహం, కల్యాణ మండప నిర్మాణం
- ముడుపులు కడితే కోరికలు తీర్చే మర్రిచెట్టు మహిమ

ముప్కాల్, మార్చి 5: మండల కేంద్రంలో మర్రి వృక్షం సుమారు 200ఏళ్ల క్రితం ఉన్న ఈ (పడిలేచిన మర్రిచెట్టు) శ్రీమహాలింగేశ్వర స్వామి వటవృక్షం గత 18ఏళ్ల క్రితం 2005జనవరి 28వ తేదీన అనాటి పరిణామాల దృష్ట్యా భారీ ఈదురుగాలులకు అకస్మాత్తుగా నేలకొరిగింది. 33అడుగుల వృత్త విస్తీర్ణం ఉన్న ఈ మర్రి చెట్టు వక్షరాజం కుకటివేళ్లతో సహా పడిపోవడం జరిగింది. అనంతరం అదే సంవత్సరం 2005జూన్ 24వ తేదీ శుక్రవారం రోజు ఎలాంటి మానవ ప్రయత్నం లేకుండానే యథాస్థానంలో పునర్ ప్రతిష్ఠమై లేచి నిలబడిందని గ్రామస్థులు పేర్కొన్నారు.

● పడిలేచిన మర్రిచెట్టుకు భక్తుల పూజలు

అనాటి నుంచి నేటి వరకు చుట్టు ప్రాంతాల నుంచి కాకుండా ఇతర జిల్లాల నుంచి పక్క రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, మహరాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి పడిలేచిన మర్రి చెట్టు మహాలింగేశ్వర స్వామి వారిని దర్శించుకొని ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకుంటున్నారు. అంతేకాకుండా మొక్కులు తీరిన భక్తులు కుటుంబ సమేతంగా సోమవారం వచ్చి వారు కట్టిన ముడుపులు తీసి



ముస్తాబైన కొత్తపల్లి రాజరాజేశ్వరాలయం

నేటి నుంచి శివరాత్రి ఉత్సవాలు

ముప్కాల్ మండల కేంద్రంలోని పడిలేచిన మర్రిచెట్టు దేవస్థానం వద్ద, కొత్తపల్లి గ్రామంలో రాజరాజేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు ఆలయ విశేష పూజలు జరిగాయి. ఉత్సవాల్లో రెండవ రోజు ఆలయంలో ఉదయం వేకువ జామున ప్రతిష్ఠ మూర్తులకు పంచామృతాలతో వేదమంత్రాలతో అభిషేకం చేసి వివిధ రకాల పూవ్వుల బిల్వ పత్రాతో అలంకరించి రుద్ర హోమం, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు.

● మహా శివరాత్రికి ప్రత్యేక పూజలు

మహా శివరాత్రి పర్వదినాన సందర్భంగా శివలింగానికి రుద్రాభిషేకం, బిల్వార్చన, 11.21 నిమిషాలకు శివపార్వతుల కల్యాణం, శివరాత్రి జాగరణ, భజన కార్యక్రమాలు, జగరణలు జరుగుతాయి. రాత్రి లింగోద్భవ కాలంలో బిల్వ అభిషేకం చేయనున్నట్లు తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణ కోసం గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని రంగులతో, వివిధ రంగుల పూలతో, విద్యుద్‌దీపాలతో అలంకరిచారు. అంతేకాకుండా జిల్లా నలుమూలల నుంచి వచ్చే భక్తుల కోసం చలువ పందిళ్లు, నీటి వసతులు పార్కింగ్ వసతులు అన్ని ఏర్పాటు చేశారు. స్థానిక ఆలయ పూజరుల ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు. అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ, దేవాదాయ కమిటీ సభ్యులు తెలిపారు.

సత్యనారాయణ వ్రతం చేసి సామూహిక భోజనాలు చేసి.. స్వామి వారిని దర్శించుకొని భక్తులు వెళ్తుంటారు.

● ప్రతీ సోమవారం పండుగ వాతావరణం

ప్రతీ సోమవారం పడి లేచిన మర్రి చెట్టు ఆలయం వద్ద పండగ వాతావరణం నెలకొంటుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి కాకుండా ఇతర మండలాల నుంచి కూడా ఎంతో మంది భక్తులు వారి కుటుంబసమేతంగా వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. భక్తుల రద్దీ దృష్ట్యా గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేసి రోజు రోజుకు పెరుగుతున్న భక్తులకు అవసరమైన వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ అద్భుత స్థలామైన మహాలింగేశ్వరస్వామి పడి లేచిన మర్రిచెట్టు ప్రతీరోజు భక్తులు పూజలు అందుకుంటుందని పూజరులు అంటున్నారు. ప్రతీ గురువారం సాయిబాబా హారతి తర్వాతి అన్నదానం చేపడతారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించిన శివరాత్రికి మూడు రోజుల ముందు ఆరు నుంచి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. గ్రామంలోని యువకులు పెద్దలు దాదాపు 20నుంచి 40మంది 41రోజుల పాటు శివదీక్షలు తీసుకుని స్వాములు ఆలయం ఆవరణలో ఉంటారు. శివరాత్రి పర్వదిన రాత్రి జాగరం చేసి మరుసటి రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాల తీసి దీక్ష విరమిస్తారు. శివరాత్రి నిలరం ఉన్న భక్తులు మరుసటి రోజు మహా అన్నదానం ఒక్కపొద్దులు విరుమిస్తారు. పడిలేచిన మర్రిచెట్టు పక్కన సాయిబాబా ఆలయం పక్కన 36 అడుగుల భారీ ఆంజనేయస్వామి విగ్రహం కొలువైంది. ఈ విగ్రహదాత నునుగొండ అంజయ్య నునుగొండ శ్యామల జ్ఞాపకార్థం (శాయమల కల్యాణ మండపం)ను నిర్మించారు. మహాలింగేశ్వరస్వామి చుట్టు పక్కల భక్తులకు ఇబ్బందుల తలెత్తకుండా దర్మశాల, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణం, వాహనాల పార్కింగ్ స్థలం కూడా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగిందని స్థానిక ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



జాతరకు ముస్తాబైన పడిలేచిన మర్రి చెట్టు ఆలయం

తెలంగాణ విశ్వవిద్యాలయంలో జాతీయ సదస్సు



హాజరైన అధ్యాపకులు, విద్యార్థులు

డిచ్‌పల్లి, మార్చి 5: తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ మరియు ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు భారతీయ భాష సంస్థ మైసురు వారి సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు ప్రాచీన శాస్త్ర కావ్యాలు లక్షణ గ్రంథాలు -సమాలోచన అనే అంశం పై రెండు రోజుల పాటు జాతీయ సదస్సులో భాగంగా మంగళవారం టీయూలో సభాధ్యక్షుడు, తెలుగు అధ్యాయన శాఖ అధ్యక్షుడు లక్ష్మణ చక్రవర్తి అధ్యక్షతలో ప్రారంభోపన్యాసం ప్రాజెక్టు డైరెక్టర్ తెలుగు విశిష్ట అధ్యాయన కేంద్రం నెల్లూరు ఆచార్య మాడభూషి సంపత్ ప్రసంగించారు. శాస్త్ర గంథాలను చదవడం మూలంగా మన ప్రాచీనులు మనకందించిన శాస్త్రీయ అంశాలు తెలుసుకునేందుకు ఆవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ యాదగిరి హాజరై మాట్లాడుతూ.. ఇలాంటి సాహిత్యంపై ఇంకా పరిశోధనలు జరగాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆరతి, ప్రొ.కనకయ్య, సాగి కమలకర శర్మ, సూర్యనారాయణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పనుల చోట ఉపాధి కూలీలకు సదుపాయాలు కల్పించాలి : ఎంపీడీవో

కమ్మర్‌పల్లి, మార్చి 5: పనులు జరుగతున్న చోట ఉపాది కూలీలకు గ్రామపంచాయితి నుండి నీడ నిమిత్తం టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్ల లాంటి తదితర సదుపాయాలు కల్పించాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజ శ్రీనివాస్ అదేశించారు. మంగళవారం మండంలోని హసాకొత్తూర్, చౌట్‌పల్లి గ్రామశివారులో కొనసాగుతున్న ఉపాధిహామీ పథకం పనులను క్షేత్రస్థాయిలో ఆయన సంద్షర్శించి పరిశిలించారు. తక్కువ కూలీలు పనికిరావడం పట్ల కారణాలను ఆయన ఆరాతీశారు. ప్రతీరోజు కనిసం వందమంది కూలీలు హజరయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పంచాయితి కార్యదర్శి ఆదేశించారు. ఆయితే మస్టర్‌లో పేర్లు ఉన్న కూలీలు మాత్రమే క్షేత్రస్థాలో ఉపాది పనులకు హాజరు కావాలని సూచించారు. పేర్లు లేనివారు హజరు కాకుండా చూసుకోవాలని ఒకరిపేర ఒకరువస్తే ఏదేని అనుకోని ప్రమాదాలు జరిగితే లేని సమస్యలు ఎదురవుతాయని సూచించారు. పనులు జరుతున్న చోట ఏలాంటి ప్రమాదాలు జరుగకుండ కూలీలకు అవగాహన కల్పించాలని, ఏవిషయమైన తక్షన సమాచారం అందివ్వాలన్నారు. అయన వెంట ఐజీఎస్ ఏపీవో విద్యానంద్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు హరీష్, సాదుల్ల, టీఏలు, సీనియర్ మేట్‌లు ఉన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై పోరుబాట : ఎమ్మెల్యే

ముప్కాల్, మార్చి 5: రాష్ట్రంలో రూ.25లక్షల మంది ఎల్‌ఆర్‌ఎస్ లబ్ధిదారుల ప్రజలపై సుమారు రూ.20వేల కోట్ల ఆర్థిక బారాన్ని మోపేలా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం బాల్కొండ నియోజకవర్గంలో చేపట్టే నిరసన ధర్నాను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణలకు, ప్రజలకు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం 10గంటలకు బాల్కొండ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద జరిగే ధర్నాకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, ఎల్‌ఆరెస్ లబ్ధిదారులు పెద్ద ఎత్తున హాజరుకావాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కోరారు.

'ప్రతీ ఇంటికీ కాంగ్రెస్ ఆరు గ్యారంటీ స్కీంలను చేరవేరుస్తాం'

భీమ్‌గల్ రూరల్, మార్చి 5: ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా 200 ల యూనిట్ ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకు వంటగ్యాస్ గ్యారంటీలను సిఎం రేవంత్ రెడ్డి నెరవేర్చారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బొదిరెస్వామి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను ప్రతి ఇంటికి చేరవేరుస్తామని అన్నారు. మంగళవారం భీమ్‌గల్ పట్టణంలో సిఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నల్లూరి శ్రీనివాస్, చరణ్, నర్సయ్య, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్‌లో ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన

ముప్కాల్, మార్చి5: జాతీయస్థాయి సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. 6వ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు తాము తయారు చేసిన పనికరాలను ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. ఈ సైన్స్ ప్రదర్శనలో రోబోను రూపొందించి ప్రదర్శించడం పట్ల ఆందరిని చూపరులను ఆకట్టుకుంది. అదే విధంగా సైన్స్‌కు సంబంధించిన చిత్రలను ముగ్గుల ద్వారా వేయడంతో పలువురిని ఆకట్టుకున్నాయి. అదేవిధంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. సైన్స్ ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయుడు గంగారాం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులను సన్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, కనకద్రి, నరేష్, బాలగంగాధర్, నరేందర్, నవీన్, అజ్మత్, రవి, సునీత, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాపాలన దరఖాస్తులను పకడ్బందీగా కంప్యూటీకరణ చేయాలి'

డిచ్‌పల్లి, మార్చి 5: డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని అడిషనల్ కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ప్రజాపాలన ధరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించి రేషన్ నంబర్లు, ఆధార్ నెంబర్లు సరి చేసి వారికి ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ వర్తించేఆ కంప్యూటర్ ఆపరేటర్ లు తగిన చొరవ చూపాలని ఎంపీడీవో రవీందర్, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్ లను ఆదేశించారు. కంప్యూటరీకరణ చేస్తున్న ప్రతి వివరాలను ధరఖాస్తులు కలెక్టర్ కార్యాలయానికి చేరేల చూడలన్నారు. పార్లమెంట్ ఎన్నికల కౌటింగ్ కోసం సీఎంసీ కళాశాల ను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు.



ఎంపీడీవో కార్యాలయంలో పైళ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

చేపూర్ పాఠశాలలో మాక్ పోలింగ్

ఆర్మూర్ రూరల్, మార్చి5: ఆర్మూర్ మండలం చేపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు అవగాహన నిమిత్తం మాక్ పోలింగ్ నిర్వహించారు.ఇందులో భాగంగా నామినేషన్‌ల స్వీకరణ, పరిశీలన , ఉపసంహరణ తుది అభ్యర్థుల జాబిత ప్రకటన గుర్తులు కేటాయించి తదితర వాటిపై అవగాహణ కల్పించారు. రిటర్నింగ్ ఆఫీసర్‌గా లహరి, ప్రొసైడింగ్ ఆఫీసర్‌లుగా సన్నిహిత, పోలింగ్ ఆఫీసర్‌గా రిశ్విత వ్యవహరించి ఎన్నికల నిర్వహణ, కౌంటింగ్, విజేతకు గెలుపు ధ్రువీకరణ పత్రం అందజేత, తదితర వివరించారు. హెచ్‌ఎం చేతనకుమారి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్ ఉపాధ్యాయురాలికి అవార్డు

కమ్మర్‌పల్లి, మార్చి 5: మండంలోని బషీరాబాద్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయురాలు గంగమణికి మహిళ ఉద్యోగ అవార్డు దక్కింది. విద్యార్థులకు ఉత్తమ పద్ధతిలో విద్యాబోనకు ఈ అవార్డు వరించినట్లు హెచ్ ఎం గంగాధర్ తెలిపారు. అంతర్జాతీయ మహిళదినోత్సవాన్ని పుస్కరించుకుని జిల్లాకేంద్రంలో జరిగిన కార్య క్రమంలో అవార్డును గంగామణి అందుకోగా మంగళవారం స్థానిక పాఠశాలలో గంగామణిని గ్రామ మాజీ సర్పంచ్ సక్కరం అశోక్ పాఠశాల హెచ్‌ఎం గంగాధర్, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆర్మూర్ టౌన్ మార్చి 5: మండలంలోని పిప్రి గ్రామశివారులో ట్రాక్టర్ ట్రాలీ ఢీకొని మంథని గ్రామానికి చెందిన శ్రావణ్‌గౌడ్(27) మృతి చెందాడు. నెల రోజుల క్రితం అమెరికా నుంచి వచ్చిన శ్రావణ్‌గౌడ్ ఫ్రెండ్స్‌తో కలిసి ఆర్మూర్ నుంచి మంథని గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పిప్రి గ్రామశివారులో ఆగివున్న ట్రాక్టర్ ట్రాలీని ఢీకొని మృతి చెందాడు. మృతునితో పాటు మరోకరి తీవ్రగాయాలు కావడంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఈనెల 12న ఆమెరికాకు వెళ్ళాల్సిన శ్రావణ్‌గౌడ్ అనంతలోకాలకు వెళ్ళడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

మనస్తాపంతో వృద్ధురాలి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్ , మార్చి5: పట్టణంలోని శాస్త్రీనగర్‌లో సోమవారం రాత్రి బూక్య కమల(65) అనే వృద్ధురాలు మనస్థాపంతో ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని శాస్త్రీనగర్‌లో కుటుంబసభ్యులతో కలిసి నివాసముంటూ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న బుక్య కమల ఇంట్లో ఎవరు లేని సమయంలో దులానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కాగా, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని ఎస్సై అశోక్ పరిశీలించి మృతదేహాన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.



ఉప్లూర్‌లో స్వామివారి పల్లకీ ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ఉప్లూర్‌లో బాలరాజరాజేశ్వర స్వామి జాతర ఉత్సవాలు ప్రారంభం

కమ్మర్‌పల్లి, మార్చి 5: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ఉప్లూర్ బాలరాజరాజేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి జాతరా ఉత్సవాలు ప్రారంభమైనట్లు ఆలయ నిర్వహన కమిటి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బద్దం రమేష్ తెలిపారు. సోమవారం నుంచి ఉత్సవాలు ప్రారంభకాగా శుక్రవారం వరకు ప్రతిరోజు స్వామివారి పల్లకి ఊరేగింపు, ప్రత్యేక పూజాకార్యక్రమమాలు తీర్థప్రసాదాలు ఉంటాయని శివరాత్రి రోజు స్వామివారి పల్లకీ ఊరేగింపు జాతరా ఉంటుందని అర్చకుడు పవన్‌శర్మ తెలిపారు. రెండవరోజు మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రి బాలరాజరాజేశ్వర స్వామివారి పల్లకిని గ్రామంలో ఘనంగా ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శిచుకున్నారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ కల్యాణోత్సవం

కామారెడ్డి టౌన్, మార్చి 5:కామారెడ్డి పట్టణంలోని గొల్లవాడ యాదవ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ కళ్యాణోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఉరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారి ఆలయం ముందు పట్నాలు పరిచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరికలు తీర్చాలంటూ ఆలయం చుట్టు ప్రదక్షణలు చేస్తు అమ్మవారికి ఒడిబియ్యం పోసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు.

ఆధునిక సాంకేతిక విధానాలపై అవగాహన

మద్నూర్, మార్చి 5: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మద్నూర్ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ దృశ్య శ్రవణ విధానం ద్వారా ఆధునీక సాంకేతిక విధానాలపై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయాధికారి రాజు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉదయం 11.30 గంటలకు సీఎం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

రామడ్గు చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

ధర్పల్లి మార్చి 5: మండలంలోని రామడ్గు సింగిల్‌విండో చైర్మన్ రాజేందర్‌రెడ్డిపై డైరెక్టర్‌లు అవిశ్వాస తీర్మాణాన్ని ప్రకటించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో గల డీసీవో కార్యాలయంలో డీసీవో శ్రీనివాస్‌రావుకు అవిశ్వాస తీర్మాణ పత్రాన్ని అందజేశారు. సింగిల్‌విండో పరిధిలో గల ఏడుగురు డైరెక్టర్‌లు అవిశ్వాన తీర్మాణానికి మద్దతు తెలిపారు. అవిశ్వాస తీర్మాణంపై ఓటింగ్ త్వరలోనే ప్రకటిస్తామని అధికారులు పేర్కొన్నారు. కాగా అవిశ్వాస తీర్మాణం పెట్టిన ఏడుగురు డైరెక్టర్‌లు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మహేందర్ ఆధ్వర్యంలో నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఆలూర్‌లో డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ

ఆర్మూర్‌రూరల్, మార్చి 5: మండల కేంద్రంలో డ్రైనేజీ నిర్మాణ పనులకు మంగళవారం తహసీల్దార్ నరేష్, ఈవో రాజలింగం భూమిపూజ చేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.6లక్షలతో డ్రైనేజీ నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కొత్తూరు గంగాధర్, ఓబీసీ మోర్చ అధ్యక్షుడు నడీసరం మల్లయ్య, కార్యదర్శి హరిష్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి 10మంది సొసైటీ చైర్మన్‌లు

డిచ్‌పల్లి, మార్చి 5: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలోని పలువురు సోసైటీ చైర్మన్‌లు బీఆర్‌ఎస్ పార్టీనుంచి మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి రూరల్ ఎమ్మెల్యే డా.రేకుల పల్లి భూపతిరెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువలు కప్పి స్వాగతించారు. మెంట్రాజ్‌పల్లి, ముత్తకుంట, గుండారం, బోర్గాం, అర్గుల్, మాధవనగర్, బర్ధిపూర్, బాడ్సి, కొలిప్యాక, పాల్దా, సోసైటీ చైర్మన్‌లు పార్టీలో చేరారు.



కాంగ్రెస్‌లో చేరిన సొసైటీ చైర్మన్‌లు



భిక్కనూరులో విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలిస్తున్న దృశ్యం

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● అడిషనల్ కలెక్టర్ చంద్రమోహన్

భిక్కనూరు, మార్చి 5: ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. మంగళవారం భిక్కనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరిక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరిక్షా కేంద్రాన్ని పరిశీలించి ప్రిన్సిపాల్ కార్యాలయంలో విద్యార్థుల హాజరు పట్టికను అనిఖీ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పరిక్షా కేంద్రంలో మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పరిక్షా కేంద్రంలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగరాజు పాల్గొన్నారు.

చేపల పెంపకంపై రైతులు దృష్టి సారించాలి

గాంధారి, మార్చి 5: రైతులు వ్యవసాయంతో పాటు లాభదాయకంగా ఉండే ఇతర వాటిపై దృష్టి సారించాలని డీపీఎం రమేష్ అన్నారు. మంగళవారం గాంధారి మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పెంపకం దారులతో సమావేశం నిర్వహించారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారని చేపల పెంపకంలో కూడా ముందుంటున్నారని అన్నారు. చేపల పెంపకంతో వచ్చే ఆదాయాన్ని ఆయన రైతును అడిగితెలుసుకున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో దక్కన్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ వేణు, డీపీఎం రమేష్, ఏపీఎం గంగారాజు, సీసీరాజు తదితరులు పాల్గొన్నారు.



ఏవోకు వినతి పత్రం అందిస్తున్న ఏబీవీపీ నాయకులు

సందేశ్‌కాళీ నిందితులపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్, మార్చి 5: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో సందేశ్‌కాళీ సంఘటన నిందితులపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సందేశ్‌కాళీ ప్రాంతంలోని మహిళలు జీహాది గ్రూప్ ద్వారా లైంగికంగా దోపిడీకి గురవుతున్నారని వారి గుర్తింపును ఉల్లంఘిస్తున్నారని అన్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని అధికార పార్టీ నాయకులు మహిళలను వివిధ రకాలుగా వేధిస్తూ పార్టీ కార్యాలయాలకు రప్పించుకుని మరీ అత్యాచారాలు చేయడం యావత్ సమాజాన్ని సిగ్గుతో తలదించుకునేలా చేస్తుందని అన్నారు. సీఎంగా ఒక మహిళ ముఖ్యమంత్రి ఉన్న ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోవడం సిగ్గుచేటని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రోహిత్, ప్రత్యూష, సాత్విక్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.



రేకుల షెడ్లకు సీల్ వేస్తున్న ఆర్‌ఐ జానయ్య, సిబ్బంది

ఇంటి నెంబర్ లేకుండా
షెడ్లు వేస్తే చర్యలు తీసుకుంటాం

కామారెడ్డి టౌన్, మార్చి 5: కామారెడ్డి మున్సిపల్ పరిధిలో ఎలాంటి ఇంటి నెంబర్ లేకుండా షెడ్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ సుజాత తెలిపారు. మంగళవారం కామారెడ్డిలోని దేవునిపల్లి, హౌసింగ్ బోర్డు కాలనీ, అశోక్ నగర్ కాలనీలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన షెడ్‌లను సిబ్బంది సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షెడ్‌లను నిర్మించిన వారు తమ వద్ద సంబంధిత డాక్యుమెంట్లను సమర్పించి ఇంటి నెంబర్‌ను కేటాయించుకోవాలని అన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా షెడ్లను నిర్మిస్తూ ఆస్తిపన్ను ఎగొట్టాలని చూసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ జానయ్య, బిల్ కలెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

8న మహాత్ముల జయంతి కమిటీ సమావేశం

బాన్సువాడ టౌన్, మార్చి 5: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఈనెల 8న మహాత్ముల జయంతి ఉత్సవాల కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు అయ్యాల సంతోష్ తెలిపారు. ఈ సమావేశంలో షెడ్యూల్ కులాల వారందరూ, ఇతర రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా దళిత నాయకులందరూ బాధ్యతగా హాజరు కావాలని కోరారు.

ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తులు అందించాలి

కామారెడ్డి టౌన్, మార్చి 5: ప్రజాపాలన సేవ కేంద్రాల ద్వారా అర్హతగల లబ్ధిదారులకు గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలను దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు గతంలో పూర్తి వివరాలు అందజేయకపోతే మండల కేంద్రం, మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన సేవ కేంద్రాలలో దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గతంలో ప్రజాపాలన ద్వారా అభయహస్తం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు గృహజ్యోతి, మహాలక్ష్మి పథకం వివరాలు సక్రమంగా లేకపోతే లబ్ధిదారులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, గ్యాస్‌బుక్, గ్యాస్ సిలిండర్ పొందిన బిల్లు, ప్రజాపాలన దరఖాస్తు రశీదు తీసుకుని వెళ్లాలని తెలిపారు. గృహజ్యోతి పథకం కోసం ప్రజాపాలన దరఖాస్తు చేసుకున్న సెల్‌ఫోన్, రేషన్‌కార్డు, మీటర్ నెంబర్, గతంలో చెల్లించిన బిల్లు రసీదు వెంట తీసుకుని కేంద్రానికి వెళ్లాలని తెలిపారు. అర్హత గల వారికి ఇప్పటికే రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేస్తుందని తెలిపారు. వేసవి కాలంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రావద్దని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని మండలాలు, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ పట్టణాల్లో నిత్యం తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. ట్యాంక్ నుంచి ఇంటింటికీ నీటి సరఫరాలో ఎక్కడైన లోపాలు ఉన్నాయో సరి చూసుకోవాలని, ఏమైన లోపాలు ఉంటే వాటిని సరి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ రమేష్, మున్సిపల్ కమిషనర్‌లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా డాక్యుమెంట్లు సేకరించి సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాలి

ప్రజాపాలన సేవ కేంద్రాల ద్వారా అవసరమైన డాక్యుమెంట్లు సేకరించి ప్రజాపాలన సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాలని విద్యుత్‌శాఖ కార్యదర్శి రిజ్వి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్‌లతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పలు అంశాలను అధికారులకు వివరించారు. ప్రజలు తమ తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, గ్యాస్ కనెక్షన్ నెంబర్, విద్యుత్ మీటర్ నెంబర్ వివరాలను తీసుకుని వచ్చి ప్రజాపాలన సేవ కేంద్రాల ద్వారా గృహజ్యోతి, గ్యాస్ సిలిండర్ పథకాలలో తమ అర్హతను పరిశీలించి అర్హుల వివరాలు నమోదు చేయాలని తెలిపారు. తెల్లరేషన్ కార్డును ముందుగా వ్యాలిడేట్ చేయాలని ముందస్తుగా తెల్లరేషన్‌కార్డు లబ్ధిదారునిగా గుర్తించిన తర్వాత సదరు దరఖాస్తుదారులు అందించే గ్యాస్ కనెక్షన్ నెంబర్ వివరాలు, విద్యుత్ మీటర్ నెంబర్ వివరాలు వ్యాలిడేట్ చేయాలని అన్నారు.

రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



మల్యాపూర్‌లో వరి పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

గాంధారి, మార్చి 5: రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ రత్న అన్నారు. మంగళవారం గాంధారి మండల పరిధిలోని దుర్గం గ్రామ శివారులో మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకోని రైతులు చేయించుకోవాలని, మొక్కజొన్న, వరి పంటలలోని తెగులు నివారణ సూచనల కోసం వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని తెలిపారు. రైతులు యూరియా అధికంగా వాడితే చీడపీడలు ఎక్కువ అవుతాయని రైతులు కావాల్సిన మేరకే యూరియా వాడితే మంచి ఫలితాలు ఉంటాయని అన్నారు. వరిలో కాండం తొలుచు పురుగు నివారణ కోసం కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం ఎస్‌పీ 400 గ్రాములు ఎకరానికి లేదా క్లోరాన్ ట్రనిలిప్రోల్ 18.5శాతం 60 మి.లీ.లు ఎకరానికి పిచికారీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో నరేష్, రైతులు పాల్గొన్నారు.

వరి పంటను కాపాడుకోవాలి

బీబీపేట: మండలంలోని మల్యాపూర్ గ్రామంలో వరి పంట పొలాలను జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ పరిశీలించారు. వాతావరణ మార్పుల వల్ల వరిలో ఆకు ఎండు తెగులు బ్యాక్టీరియా ఏర్పడుతుందని దీని నుంచి వరి పంటను కాపాడుకోవచ్చని ఆమె అన్నారు. దీని నివారణకు స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్, 100 గ్రాములు లేదా వలిడామైసిన్ 500ఎంఎల్ ఎకరానికి చొప్పున పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే మెడకాటు, తెల్ల కంకి రోగాలకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేసుకోవాలన్నారు. ఆమె వెంట ఏఈవో రాఘవేంద్ర, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు



కాంగ్రెస్‌లోకి చేరుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

బాన్సువాడ, మార్చి 5: నసురుల్లాబాద్ మండలానికి చెందిన సర్పంచ్‌లు, సహకార సంఘం అధ్యక్షుడు బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని రామాలయం నుంచి ద్విచక్ర వాహనాలు, కార్ల భారీ ర్యాలీతో బాన్సువాడ పట్టణంలోని పీఆర్ గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు, అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన వైపు ముందుకు వెళుతుందని, ఇచ్చిన 6 గ్యారెంటీ పథకాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నట్లు మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ప్రజా సమస్యల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళల అండు బాటులో ఉంటామని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించాలని కాంగ్రెస్ శ్రేణులకు మాజీ మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తాం

బాన్సువాడ టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని బాన్సువాడ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉచిత విద్యుత్ పథకంలో భాగంగా రాజారాం దుబ్బలో లబ్ధిదారులకు జీరో కరెంటు బిల్లును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో ప్రజారంజక పాలన సాగుతుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పక అమలు చేస్తామన్నారు. ప్రజల కళ్లల్లో ఆనందం చూడటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహరిల్ శ్రీనివాస్, అక్బర్, రాజు, రహీం, అంబర్‌సింగ్, మధుసూదన్‌రెడ్డి తదితరులున్నారు.

అవిశ్వాస తీర్మానంలో నెగ్గినా కోర్టు స్టేతో నిలిచిన ఫలితాలు

పిట్లం, మార్చి 5: మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామంలో గల సహకార సంఘంపై గత నెల ఫిబ్రవరి 8న బీఆర్‌ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై పాలకవర్గం సభ్యులు డీసీవో శ్రీనివాస్ అవిశ్వాస తీర్మానంపై మద్దతు పలికిన విషయం తెలిసిందే. సహకార సంఘంలో డీసీవో శ్రీనివాస్ అవిశ్వాసంపై మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి శ్రీనివాస్ అవిశ్వాసంపై ఎన్నికలు నిర్వహించామని, పాలకవర్గంలో 13 మంది సభ్యులు ఉన్నారని, గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అధ్యక్షుడిగా నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా సాయాగౌడ్ పదవిలో కొనసాగారన్నారు. పాలకవర్గం సభ్యులు అవిశ్వాస తీర్మానం మేరకు ఎన్నికలు నిర్వహించామని, 13 మందిలో 10 మంది పాలకవర్గం సభ్యులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపగా, ముగ్గురు మద్దతు తెలుపలేరని అన్నారు. బీఆర్‌ఎస్ సహకార సంఘం అధ్యక్షుడు కోర్టు నుంచి స్టే తీసుకరావడంతో ఫలితాలు నిలిపివేశామన్నారు. కోర్టు నుంచి తీర్పు రాగానే నూతన కార్యవర్గం ఏర్పాటు చేస్తామని తెలిపారు.



చిన్నకొడప్‌గల్ సహకార సంఘంలో అవిశ్వాస తీర్మానంలో కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతున్న పాలకవర్గం సభ్యులు

మున్సిపల్ కార్యాలయంలో బడ్జెట్ సమావేశం

బాన్సువాడ టౌన్, మార్చి 5: బాన్సువాడ మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ చైర్మెన్ జంగం గంగాధర్ అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2024 - 25 సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్, 2023 - 24 సవరణ బడ్జెట్ గురించి కౌన్సిల్ సభ్యులతో చర్చించడం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్మెన్ గంగాధర్ మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి గాను 7కోట్ల 84లక్షల రూపాయలు బడ్జెట్ అంచనా వేయడం జరిగిందని, అందుకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపినట్లు ప్రకటించారు. బడ్జెట్ తీర్మానాన్ని ఆమోదించిన కౌన్సిలర్లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మెన్ జుబేర్, కమిషనర్ అలీం, కౌన్సిలర్లు తదితరులున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మెన్

ఎల్లారెడ్డిలో 22 బెల్టు షాపులపై కేసుల నమోదు

● ఎక్సైజ్ సీఐ షాకీర్ హుస్సేన్

లింగంపేట, మార్చి 5: ఎల్లారెడ్డి ఎక్సైజ్ పరిధిలో ఇప్పటి వరకు 22 బెల్టు దుకాణాలపై దాడులు చేసి 19 మందిపై కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ షాకీర్ హుస్సేన్ తెలిపారు. ఆయన మంగళవారం లింగంపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా బెల్టు దుకాణాలపై దాడులు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఎక్సైజ్ పరిధిలోని ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట, గాంధారి మండలాల్లో దాడులు చేస్తున్నామని గత మూడు నెలలుగా 22 కేసులు చేశామని 19 మందిని అరెస్టు చేశామని 297 లీటర్ల మద్యం, 41 లీటర్ల బీర్లు సీజ్ చేశామని ఆయన తెలిపారు. ఎలాంటి ఫిర్యాదు వచ్చినా దాడి చేసి కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

లింగంపేట, మార్చి 5: మండలంలోని అయ్యపల్లి వద్ద మంగళవారం బైక్ అదుపుతప్పి పడడంలో భవానిపేటకు చెందిన బోరంచ సంగప్ప, విజయలకు తీవ్రగాయాలు కాగా స్థానికులు 108కు సమాచారం అందించి వారిని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంగప్ప, విజయలు మెదక్ నుంచి భవానిపేటకు వెళ్లుతుండగా అయ్యపల్లి వద్ద వారు ప్రయాణిస్తున్న ద్వి చక్రవాహనం అదుపుతప్పి కింద పడడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దొంగతనం కేసులో 9 నెలల జైలు శిక్ష

బాన్సువాడ, మార్చి 5: బాన్సువాడ మండలం దేశాయిపేట్ గ్రామానికి చెందిన తౌటి విఠల్ అనే వ్యక్తి స్కూటీ దొంగతనం కేసు లో మంగళవారం బాన్సువాడ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ భార్గవి తీర్పు నేప థ్యంలో ఐపీసీ 379 ప్రకారం నేరస్తుడికి 9 నెలల జైలు శిక్ష, రూ.100 జరిమానా చెల్లించాలని తీర్పు చెప్పినట్లు బాన్సువాడ సీఐ కృష్ణ తెలి పారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి

సదాశివనగర్, మార్చి 5: సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన హైకోర్టు అడ్వకేట్, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. గతంలో గ్రామ సర్పంచ్‌గా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు. అతని తండ్రి మధుసూదన్‌రెడ్డి గతంలో ఎమ్మెల్యేగా కొనసాగారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

సదాశివనగర్, మార్చి 5: మండలంలోని ధర్మారావుపేట గ్రామానికి చెందిన అరుణ(21) మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు. దోమకొండ మండలం చింతమన్‌పల్లికి చెందిన అరుణను ధర్మారావుపేటకు చెందిన దొంతర బోయిన అనిల్‌కు ఏడాది క్రితం ఇచ్చి వివాహం జరిపారు. కూతురుకు అత్తింటివారి వేధింపులు ఆత్మహత్య చేసుకునేలా చేశాయని మృతురాలి తండ్రి నీలస్వామి బంధువులతో వచ్చి గొడవకు దిగాడు. దీంతో పోలీసులు వారి సముదాయించారు. అరుణ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. విచారణ అధికారిగా ట్రైనీ ఐపీఎస్ అధికారి కాజల్ ఉన్నారని తెలిపారు.

కొనసాగుతున్న విచారణ

రామారెడ్డి, మార్చి 5: మండలంలోని అన్నారం గ్రామంలో దుండగుల రవీందర్ ఇంట్లో నాటు బాంబు పేలడంతో ఆయన భార్య శిరీషకు తీవ్ర గాయాలైన విషయం విధితమే. మంగళవారం సైతం బాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. ఈ విషయంపై సెక్షన్ అధికారి దివ్య మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో బాంబులు పేల్చడం, అటవీ జంతువులను చంపడం చట్టప్రకారం నేరమని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యువతి అదృశ్యం

ఎల్లారెడ్డి, మార్చి 5: ఓ యువతి అదృశ్యమైన సంఘటన ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలం లోని అడవి లింగాల తండాకు చెందిన దరవత్ సుమి త్ర అనే యువతి ఫిబ్రవరి 29న రాత్రి 8 గంటలకు ఇంట్లోంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయిందని సుమి త్ర కోసం ఎంత వెతికినా దొరకకపోవడంతో యువతి తల్లి శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఐకేపీ అసిస్టెంట్ మేనేజర్‌పై దాడి

ఎల్లారెడ్డి, మార్చి 5: ఎల్లారెడ్డి మండలంలోని సోమర్‌పేట్ గ్రామానికి చెందిన అనురాధ అనే మహిళ శ్రీ నిధిలో లోన్ తీసుకోగా రికవరీ కోసం ఐకేపీ అసిస్టెంట్ మేనేజర్ కొండం శ్రీనివాస్ తమ సిబ్బందితో వెళ్లగా అనురాధ భర్త బాలకృష్ణ మేనేజర్‌తో దుర్భాషలాడి చొక్కా పట్టి లాగి కొట్టాడని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేష్ తెలిపారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్టు

భిక్కనూరు, మార్చి 5: మండల పరిధిలో బైక్‌ల దొంగతనానికి పాల్పడిన ఇద్దరు బైక్ దొంగలను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించామని భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా భిక్కనూరు పోలీస్‌స్టేషన్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ భిక్కనూరులో అనుమానాస్పదంగా తిరుగుతున్న సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామానికి చెందిన లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన కనకరాజుతో కలిసి గత ఫిబ్రవరి 28న భిక్కనూరు సిద్ధరామేశ్వర వైన్స్ వద్ద ఒకటి, భిక్కనూరు ఎల్లమ్మ ఆలయం వద్ద ఒక బైక్‌తో పాటుగా సిద్దిపేటలో రెండు బైక్‌లను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. ఈ మేరకు వారివద్ద నుండి నాలుగు బైక్లను స్వాధీనం చేసుకుని ఇద్దరిని రిమాండ్‌కు తరలించడం జరిగింద న్నారు. ద్విచక్రవాహనదారులు తమ వాహనాలను సురక్షిత ప్రదేశంలో పార్క్ చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.



కేసు వివరాలను వివరిస్తున్న ఎస్సై

ఆకతాయిలు అడ్డుకుంటే షీటీంకు సమాచారం అందించాలి

తాడ్వాయి, మార్చి 5: పాఠశాలకు వస్తున్న సమయంలో ఎవరైన ఆకతాయిలు అడ్డుకుని అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే షీటీంకు సమాచారం అందించాలని తాడ్వాయి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో మోసాలు ఎక్కువైపోయాయని ఎవరైన గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌చేసి ఓటీపీ చెప్పమంటే చెప్పవద్దని తెలిపారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. ద్విచక్రవాహనం నడిపించే ప్రతీ వ్యక్తి హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌గౌడ్, ఇర్ఫాన్, ఎల్లారెడ్డి సబ్ డివిజన్ షీటీం ఇన్‌చార్జ్ కానిస్టేబుల్ శ్రీను, ప్రిన్సిపాల్ స్వామి, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమ కోసం కృషి చేయాలి

కామారెడ్డి టౌన్, మార్చి 5: పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసే రాజకీయ పార్టీలు దివ్యాంగుల సంక్షేమం కోసం మేనిఫెస్టోను రూపొందించేలా కృషి చేయాలని విజ్ఞాన్ వికలాంగుల సేవాసమితి అధ్యక్షుడు దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ దివ్యాంగులకు ఉచిత రైల్వేసౌకర్యం, జీవితాబీమా, స్టడీసర్కిల్, ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం, ఉచిత ఆహార భద్రత సౌకర్యం, పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు రాజకీయ రిజర్వేషన్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఆర్థిక రుణాలు, 2016 దివ్యాంగుల చట్టం అమలు తదితర వాటిపై దృష్టి సారించాలని కోరుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన పథకాలు వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్‌కమిటీ వైస్ చైర్మన్ నితీష్‌రెడ్డి, సీనియర్ నాయకుడు రంగ్యానాయక్, బంటు స్వామి, రాజు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

థియేటర్	సినిమా
దర్శన్	హనుమాన్
శాంతి	ఊరు పేరు భైరవకోన
ప్రియా 70	ఈగల్
ప్రియా 35	ఆపరేషన్ వాలెంటైన్

బాన్సువాడ

థియేటర్	సినిమా
మహేశ్వరి	గుడాచారి 111
వెంకటేశ్వర	ఆపరేషన్ వాలెంటైన్

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	160	180
వెన్‌కాబ్(కిలో)	100	180	210

